ప్రహసిత్ స్టేజి మెట్లెక్కాడు.

ముందు చూసింది మంత్రి ఆంజనేయులు.

ఎవరో యువకుడు తన ఉపన్యాసానికి ఉత్తేజం చెంది షేక్‌హాండ్ ఇవ్వటం కోసం వస్తున్నాడనుకున్నాడు.

ప్రహసిత్ దగ్గరగా వచ్చి మైకుకి అవతలి వైపు నిలబడ్డాడు.

ఇద్దరి మధ్యా బల్ల వుంది. బల్లమీద పూలదండలున్నాయి.

మంత్రి నవ్వుతూ, విషయం ఏమిటన్నట్టు చూశాడు.

అప్పుడు కొట్టాడు ప్రహసిత్ మొహం పచ్చడయ్యేలా ...... పిడికిలి బిగించి ...... ఒకే ఒక దెబ్బ.

ఎదురుగా వున్నది అమాత్యుడనిగానీ, దాని పరిణామాలు చాలా భయంకరంగా వుంటాయనిగానీ, తను భారతదేశాన్ని రిప్రజెంట్ చేసే ఒక క్రీడాకారుడని గానీ అతడికా సమయంలో గుర్తు లేదు. స్వంత చెల్లెల్నో, భార్యనో, తల్లినో అవతలి వ్యక్తి అవమానపరిస్తే, రవ్వంత ఉప్పూ కారం రక్తంలో వున్న ఏ యువకుడైనా ఆవేశపడటం సహజం. కానీ ఈ ఆవేశం వేరు. ఇది వెయ్యి రెట్లు ఎక్కువ. తన ప్రాణాన్నే ఎవరో అవమానపర్చినట్టు ......

"నీ కోసం నేనున్నాను. నీకు ఎక్కడ ఏం జరిగినా ఇక్కడ నేను స్పందిస్తాను. నేనుండగా పంచభూతముల్లో ఏవీకూడా నిన్ను చెడు దృష్టితో చూడనివ్వను ...... " అన్నట్టు అతను ఆ మంత్రిని కొట్టాడు.

అప్పటివరకూ ప్రతిమలా నిలబడిన బాడీగార్డు చప్పున ఈ లోకంలోకి వచ్చాడు.

అప్పటికే తాపీగా ప్రహసిత్ వేదిక మెట్లు దిగుతున్నాడు.

సభ మొత్తం నిర్వణ్ణమై చూస్తోంది.

సూది పడితే వినపడేటంత నిశ్శబ్దంగా వుంది.

సభలో అందరూ నిశ్చేష్టులై పోయారు. మధూహ కూడా చేష్టలుడిగినట్టు వుండిపోయింది.

విధి నిర్వహణ గుర్తొచ్చి బాడీగార్డు ముందుకు కదిలాడు.

వేదిక మెట్లు దిగుతూన్న ప్రహసిత్‌ని వెనుకనుంచి తుపాకీ బోనెట్‌తో పొడిచాడు.

ప్రహసిత్ అలానే మెట్లమీద కూలిపోయాడు. రక్తం జివ్వున చిమ్మింది. సభలో ఒక్కసారిగా కలకలం రేగింది.

ఈ లోపులో దూరంగా వున్న ఇన్‌స్పెక్టర్ పరుగెత్తుకుంటూ వచ్చాడు. ప్రహసిత్ కస్టడీలోకి తీసుకోబడ్డాడు. ఆ తరువాత అతడిని ఆస్పత్రికి పంపించారు.

## 4

ఆ మరుసటి రోజు పేపర్లో ఈ వార్త ప్రముఖంగా వచ్చింది.

ఒక ఆగంతకుడు మంత్రిమీద దాడి చేసినట్టు, బాడీగార్డు అతడికి అడ్డుపడి గాయపర్చినట్టు, పోలీసులు ఆ అగంతకుడిని అరెస్టు చేసినట్టు వివిధ పత్రికల్లో వచ్చింది.

ఆ రోజు జరిగింది చిన్న సాహితీ సమావేశం అవటంవల్లనూ, దానికి అధ్యక్షత వహించింది ఏమాత్రం ప్రాముఖ్యం లేని మంత్రి అవటం వల్లనూ, ఆ సభకు పత్రికా విలేకర్లు ఎవరూ రాలేదు.

కేవలం మధూహ ఒక్కతే వెళ్ళింది.

అక్కడ నిజంగా జరిగిందేమిటో వివరంగా వ్రాసిచ్చింది. ఎడిటర్ శాస్త్రి దానిని ప్రముఖంగా బాక్సుకట్టి పెద్ద అక్షరాల్తో మొదటి పేజీలో వేశాడు.

దాంతో మళ్ళీ సంచలనం రేగింది.

ఈ కేసులో ఇన్‌వాల్వ్ అయింది ప్రముఖ టెన్నిస్ ఆటగాడు ప్రహసిత్ అన్న వార్త ఎప్పుడైతే బయటకొచ్చిందో అది నేషనల్ న్యూస్ అయింది. మంత్రి ఆంజనేయులి కన్నా ప్రహసిత్‌కే ఎక్కువ పేరుంది.

ఇతడు రాష్ట్రానికి సంబంధించిన వాడు. అతడు దేశానికి సంబంధించిన వాడు.

"డేవిస్ కప్ ప్లేయర్ ...... ఇన్ ...... హాస్పిటల్ " అని మాగజైన్స్ ప్రచురించాయి.

ఆస్పత్రిలో ప్రహసిత్‌ని పత్రికా విలేకర్లు చుట్టుముట్టారు. అందరూ ఒకటే ప్రశ్న ...... "నిండు వేదిక మీద మంత్రిని ఎందుకు కొట్టారు?".

అందరికీ అతను ఒకటే సమాధానం చెప్పాడు. " ...... ఆయన బాధ్యతాయుతమైన మంత్రి. బాధ్యత లేకుండా మాట్లాడాడు. 'అడవి బాపిరాజు' ...... అనే నవల గోనగన్నారెడ్డి వ్రాశాడో, 'గోనగన్నారెడ్డి' అన్న నవల 'అడవి బాపిరాజు' వ్రాశాడో కూడా తెలియని వ్యక్తి సాహిత్యం గురించి మాట్లాడటం హాస్యాస్పదం. పక్క వ్యక్తులు ఏదో చెప్తే, దానికి వంత పాడాడు. ఆధునిక సాహిత్యం పాడయింది అన్నాడు. అంతవరకూ ఊరుకున్నాను.

ఒక రచయిత్రిని పట్టుకుని వ్యక్తిగతంగా దూషించాడు. అందువల్ల ఇక క్షమించలేక పోయాను".

"మీరు క్రీడాకారుడు కదా. మీకు సాహిత్యం గురించి తెలుసా?"

"ఆ మంత్రిగారి కన్నా ఎక్కువే తెలుసు".

విలేకర్లలో నవ్వులు.

“ఒకప్పటికన్నా సాహితీరంగం ఇపుడు పాడవలేదని మీ ఉద్దేశ్యమా?”.

“ఒక్కప్పటితో పోల్చుకుంటే ...... ” ఆగి పూర్తి చేశాడు “ఇప్పటి అసెంబ్లీలంత పాడవలేదని వుద్దేశ్యం”.

ఈసారి మరింత పెద్ద పెట్టున నవ్వులు.

ఆ కలకలం మధ్యలో డాక్టర్ గదిలో ప్రవేశించాడు “మిస్టర్ ప్రహసిత్, మీతో కొంచెం పర్సనల్‌గా మాట్లాడాలి” అన్నాడు విలేకర్ల సమావేశం తొందరగా ముగించమన్నట్టుగా.

“విషయం ఏమిటి డాక్టర్?” ప్రహసిత్ అడిగాడు.

“కొంచెం మాట్లాడాలి. లేదంటే తరువాతొచ్చి మాట్లాడతాను.”

ప్రహసిత్ నవ్వాడు “అంత రహస్యం ఏముంటుంది డాక్టర్? ఈ ట్రీట్ మెంట్ పుణ్యమా అని ...... నా రక్తంలో ఎయిడ్స్ వున్నట్టు బయటపడిందా ఏమిటి?”.

“అది చాలా గొప్ప సెన్సేషనల్ న్యూస్ అవుతుంది” ఎవరో వెనుకనుంచి అన్నారు. అందరూ నవ్వారు.

డాక్టర్ నవ్వలేదు. ఎక్స్‌రే ముందుకు తోస్తూ “ఐయామ్ సారీ ప్రహసిత్ ...... ” అన్నాడు “ ...... బోయ్‌నెట్ తాలూకు కత్తిపోటుకి మీ రొమ్ము ఎముకతో పాటూ నరమూ దెబ్బతిన్నది. ఇక మీరు టెన్నిస్‌కి పనికిరారు ...... ”.

ఒక స్టిల్ ఫోటోగ్రాఫ్‌లా నిశ్చేతనంగా ప్రహసిత్ మొహంమీద నవ్వు ఆగిపోయింది. అతడి చేతివేళ్ళు దిండు చుట్టూ అప్రయత్నంగా బిగుసుకున్నాయి. సగం తెరుచుకున్న పెదవుల మధ్య బాధ, ఉచ్ఛ్వాస, నిశ్వాసల మధ్య సందిగ్ధమై ఆగిపోయింది.

ఎన్నో వార్తలకి ప్రత్యక్షసాక్షులైన విలేకర్లు కూడా ఈ న్యూస్‌కి స్తబ్ధులయ్యారు.

“మీరు బలంగా బంతిని సర్వ్ చేయటానికి వీలులేదు. మీ ఛెస్ట్ బోన్స్ మీద అంత వత్తిడి అభిలషణీయం కాదు”.

ప్రహసిత్ వినటం లేదు.

అతడికి ‘మోనికాసెలెస్’ అనే చిన్న పిల్ల గుర్తొచ్చింది. ప్రపంచ నెంబర్‌వన్ టెన్నిస్ క్రీడాకారిణి అయిన ‘స్టెఫీగ్రాఫ్’ని ఆ చిన్న పిల్ల ఓడించి, అగ్రపథానికి దూసుకుపోతున్న తరుణంలో, స్టెఫీగ్రాఫ్ అభిమాని అయిన ఒక యువకుడు, తన ప్రియతమ క్రీడాకారిణి ఒక చిన్నపిల్ల ముందు ఓడిపోవటం సహించలేక, ఆటస్థలంలోకి వురికి మోనికాసెలెస్‌ని ఈ విధంగానే అందరిముందు కత్తితో పొడిచి, ఆమెని ఆటకు దూరం చేసినప్పుడు......

ఆమె ఇలాగే బాధపడి వుంటుందా? ఒక చిన్న గాయం వలన మిలియన్ల డబ్బు నష్టం ! అయినా అక్కడ డబ్బు కాదు. తను ప్రాణం కన్నా మిన్నగా ప్రేమించిన దాన్నుంచి శాశ్వతంగా దూరమై పోవాల్సి రావటం ......

హృదయం నిండా కన్నీళ్ళు నింపుకుని ...... అవి బయటకు రాకుండా ...... తన మీద నిశ్శబ్దం ఒంపుకుని ...... అతడు కర్మయోగి అయ్యాడు. శతసహస్రవర్షాలుగా పచ్చదనాన్ని నింపుకున్న భూమాతని ఒక విధి వైపరీత్యం లావా రూపంలో కబళించి వేస్తే మౌనంగా రోదించే ప్రకృతిలా విచలితుడయ్యాడు.

క్షణం సేపే.

క్షణంలో మామూలు మనిషై ...... అదే చిరునవ్వుతో ...... “పోనీ లెండి డాక్టర్, కుడిచేత్తో ‘సర్వ్’ చేయలేకపోతే ఎడమచేత్తో నేర్చుకుంటాను” అన్నాడు.

అది సాధ్యం కాదనీ, సాధ్యమయినా, దేశస్థాయిలో తిరిగి స్థానం సంపాదించటం అసాధ్యమనీ అక్కడ అందరికీ తెలుసు.

తమ వ్యధకి నిశ్శబ్దాన్ని భాగస్వామిని చేసి, అందరూ స్తబ్ధులై వున్న తరుణంలో ...... ఆ మౌనాన్ని భగ్నం చేస్తూ మధూహ అక్కడికి ప్రవేశించింది.

వస్తూనే విప్పారిన మొహంతో "గుడ్‌న్యూస్ ప్రహసిత్. మీమీద మంత్రిగారు కేసు ఉపసంహరించుకున్నారు" అంది ఆనందంగా.

అక్కడ ఎవరూ మాట్లాడలేదు.

"ఏమిటందరూ ఇంత మౌనంగా వున్నారు? ఇంతకన్నా సంతోషకరమైన వార్త వుంటుందా? అఫ్‌కోర్స్ ...... బాడీగార్డ్ చేసిన తప్పుని మనం ఎత్తి చూపాం కదా. అదీగాక, తనని కొట్టింది నేషనల్ ఛాంపియన్ అని కూడా ఆయనకి తెలిసింది. అందువల్ల కేసు విత్‌డ్రా చేసుకుని " అంది.

దానికీ ఎవరూ సమాధానం చెప్పలేదు.

"ఏమిటీ? ఈ వార్త మీకు ముందే తెలుసా? తెలిసీ నన్ను ఫూల్‌ని చేస్తున్నారా?".

"ప్రహసిత్‌గారు ఇక టెన్నిస్‌కి పనికిరారు ...... " ఒక జర్నలిస్ట్ నెమ్మదిగా అన్నాడు.

ఆమెకు మొదట అర్థం కాలేదు.

అతడివైపు అయోమయంగా చూసింది. జరిగినదంతా ఎవరో చెప్పారు.

ఆమె కత్రాట అయింది. ప్రహసిత్‌వైపు బ్లాంక్‌గా చూసింది.

ఒక్కొక్కసారి మనం చేసిన చిన్నపని ...... మన జీవితం మీద ఎంతో ప్రభావాన్ని చూపుతుంది. మన భవిష్యత్‌ని సమూలంగా నాశనం చేస్తుంది. పేకమేడల్లా కూల్చేస్తుంది. ఆ పని ఎందుకు చేశామా అని జీవితాంతం కుమిలిపోయేలా చేస్తుంది.

నాది తొలిచూపు ప్రేమ కాదన్నట్టు సగర్వంగా ...... రెపరెపలాడుతున్న కేతనంలా వున్నాడు. ప్రేమ పరివేష్టుడై ఎవరో కవి అన్నట్టు ......

"నీ రాజసానికవి ...... నీరాజనాలు " అన్నట్టున్నాడు.

5

లక్ష్మికి ఆ రోజు చాలా డల్‌గా అనిపించింది. ఇంటికి రాగానే అలాగే పక్కమీద నిస్త్రాణగా చాలాసేపు పడుకుని వుండిపోయింది. బాగా బలహీనంగా తోచింది. అది శారీరకమైన అలసటే కాకుండా మానసికమైన అలసట కూడా!

ఆ రోజు డాక్టర్ విశాల్ క్లినిక్‌లో ఆమెకి డి అండ్ సి ఆపరేషన్ జరిగింది.

అంతక్రితం కలసినప్పుడు 13 ...... 14 ...... 15 ...... రోజుల్లో రమ్మన్నాడు. ఆ తేదీ లెక్క పెట్టుకుని వెళ్ళింది. ఆపరేషన్ అనేసరికి భయపడింది. కానీ ఆమె భయపడినంతగా ఏమీ అవలేదు. అంతా నిముషాల్లో జరిగిపోయింది. లోకల్ అనెస్తీషియా కూడా ఇవ్వలేదు. వజీనా దగ్గర ఇంజెక్షన్ ఇచ్చి ఆపరేషన్ పూర్తి చేశారు.

ఆమె ఇంటికొచ్చిన అరగంటకి బయట కాలింగ్‌బెల్ మ్రోగింది. తలుపుతీస్తే ఎదురుగా మధూహ!

ఆమెని చూడగానే లక్ష్మి మొహం విప్పారింది. "రా ...." సాదరంగా ఆహ్వానించింది.

"అలా వున్నావేం?"

"ప్రొద్దున్నే డి అండ్ సి అయింది"

"అలాగా" అంది మధూహ సోఫాలో కూర్చుంటూ "విష్ణు రాలేదా?"

"ఆయన కాంప్‌కి వెళ్ళాడు " అబద్ధం చెప్పింది.

చాలామంది ఆడవాళ్ళలాగే లక్ష్మికూడా భర్తల నిరాసక్తతని బయటకు చెప్పుకోదు. తమది ఆదర్శదాంపత్యంలాగే ప్రొజెక్ట్ చేస్తుంది. మధూహ దృష్టిలో విష్ణు ...... లక్ష్మిలది అన్యోన్య దాంపత్యం .

"ఆపరేషన్ ఎక్కడ చేశారు?"

"డాక్టర్ విశాల్ క్లినిక్‌లో"

మధూహ భృకుటి ముడిపడింది.

ఎందుకో ఆమెకి ఆ పేరు వినగానే ఏదో అపశృతిలా తోస్తుంది. దానికి తర్కంలేదు. రాజు ఆ క్లినిక్‌తో అసోసియేట్ అయ్యాడు కాబట్టి ...... రాజు హిప్నాటిజం పేరుమీద చేస్తున్న మోసం తెలుసు కాబట్టి ...... ఆ అనుమానం తనకి వచ్చి వుంటుంది ...... అనుకుంది.

నిజానికి డాక్టర్ విశాల్ క్లినిక్‌లో ఏ మోసమూ లేకపోయి వుండవచ్చు. అతడు ఎం.బి.బి.ఎస్. డాక్టర్ కదా!

ఆలోచన్లని పక్కకి పెడుతూ "మా పత్రిక చదువుతున్నావా? అని అడిగింది.

"చదువుతున్నాను. ఏం?"

"అందులో లక్ష్మి అనే రచయిత్రి వ్రాస్తున్న సీరియల్ మీద పెద్ద సంచలనం రేగుతోంది. పేపర్లు చదవటం లేదూ?".

"నాకు డైరీలు చదివే అలవాటు లేదు. ఏమైంది?" అనుమానంగా అడిగింది.

"ప్రహసిత్ అని ఒక టెన్నిస్ ప్లేయర్ గురించి నీకు చెప్పాను గుర్తుందా. ఏదో ఒక ఫోన్ నెంబర్ ఇవ్వాల్సి వచ్చి నీ నెంబర్ ఇచ్చానని కూడా చెప్పాను".

లక్ష్మి గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. మనసులో సంచలనాన్ని అతి కష్టంమీద అణుచుకుంటూ " ...... ఏం జరిగింది? " అని అడిగింది.

"ఆ ప్రహసిత్ చాలా గాఢమైన ప్రేమికుడిలా వున్నాడు. అతడిని చూస్తే నాకు ఈర్ష్యగా వుంది కూడా ...... "

“ఏ ...... మైం ...... ది?” లక్ష్మి కంఠం కీచుగా ధ్వనించింది.

మధూహ పట్టించుకోలేదు. తన ధోరణిలో చెప్పుకుపోసాగింది “మొన్న ఒక సభకి వెళ్ళాన్లే. అక్కడో మంత్రి మా సీరియల్ గురించి అవాకులూ చవాకులూ పేలాడు. ఆ రచయిత్రి లక్ష్మి గురించి కూడా ఏదో అసభ్యంగా మాట్లాడేసరికి ప్రహసిత్ వేదిక ఎక్కి అందరిముందూ ఆ మంత్రి మూతి పగలగొట్టాడు. ప్రేమంటే అలాగే వుండాలనుకో. కానీ ఈ మొగాళ్ళలో ఎంతమందికి అంత ధైర్యం వుంటుంది చెప్పు. తన గర్ల్‌ఫ్రెండ్  గురించి ఎవరైనా జోకు వేసినా, తామూ అందులో కలిసిపోయి జోకు వెయ్యటమేగా వారికి తెలిసిన విద్య! ప్రహసిత్ అలాకాదు. ఆ క్షణం అతన్ని చూడాలి. నాకు భలే ముచ్చటేసింది. ఆ లక్ష్మి ఎవరోగానీ చాలా అదృష్టవంతురాలు. జీవితంలో అలాటి ఫ్రెండ్ ఒక్కడుంటే చాలు. ఇంతకీ అసలు విషయం చెప్పలేదు కదూ. పాపం ప్రహసిత్ ఆ మంత్రిని కొట్టి వేదిక దిగుతుంటే వెనుకనుంచి బాడీగార్డు బోనెట్‌తో పొడిచాడు. ఇక అతడు జీవితాంతం టెన్నిస్‌కి పనికిరాడట. చాలా దురదృష్టం కదూ. నిన్న ఆస్పత్రికి వెళ్ళాను. ఆ ప్రహసిత్ మొహంలో అసలు దిగుల్లేదు. అదే ఆశ్చర్యం. మైగాడ్, అసలు ప్రేమంటే ఇలా వుంటుందా అనిపించింది. ఎక్కడో కథల్లో చదవటమే కానీ ప్రత్యక్షంగా చూడలేదు. ఆ లక్ష్మి ఎవరోగాని అజ్ఞాతంనుంచి బయటపడితే బావుణ్ణు. తనని ఇంతగా ప్రేమించే వ్యక్తి ...... ”

ఏడుపు వినపడటంతో మధూహ ఆగింది.

లక్ష్మి వెక్కి వెక్కి ఏడుస్తోంది.

మధూహ ఆశ్చర్యంగా ‘లక్ష్మీ’ అంది.

ఇక ఆగలేనట్టు లక్ష్మి బరస్ట్ అవుతూ “నేనే ...... నేనే” అంది.

మొదట మధూహకి అర్థం కాలేదు. క్రమక్రమంగా మబ్బులు విడిపోతున్నట్టు ......

“నువ్వు ...... ?” అంది

"అవును. ఆ నవల వ్రాస్తోంది నేనే. అతన్ని కలిశాను కూడా. మళ్ళీ కలవొద్దని చెప్పాను కూడా. నువ్విచ్చిన నా ఫోన్‌నెంబర్ కరెక్టే. కానీ ...... కానీ ఎలా? నువ్వే చెప్పు, నేను వివాహితురాల్ని. నైతిక విలువలంటూ కొన్ని వుంటాయి కదా. నన్నింతగా ప్రేమించే భర్తని కాదని అతన్ని ఎలా స్వీకరించను? నా మనస్సు అందుకు ఎలా అంగీకరిస్తుంది? అంతా అతనికి చెప్పేశాను. అతను వెళ్ళిపోయాడు. ఇక అదొక్కటే పరిష్కారం" వాక్యానికీ వాక్యానికీ పొంతన లేకుండా చెప్పుకుపోతోంది.

మధూహ ఇంకా షాక్ నుంచి తేరుకోలేదు.

## నాలుగో అధ్యాయం

**"నడుస్తూ, నిలబడుతూ, పని చేస్తూ మౌనాన్ని ఆస్వాదిస్తూ ......**
**కదిలినప్పుడు, కదలనప్పుడు, కదలాలనిపించినప్పుడు**
**నిద్రపోయేముందు, లేవబోయేముందు ......**
**ప్రతి ఆలోచన ముందూ, వెనకా, ...... 'లోనూ'**
**ఎప్పుడూ నువ్వు నాకు తల్లిలా తండ్రిలా**
**నీ కౌగిలిలో నేను పొత్తిళ్ళలో పాపలా**
**...... ఇద్దరం ఒకటై ...... ముగ్గురుగా విడిపోయి**
**కల్సి, కుటుంబమై ...... "**

చదువుతూన్న మధూహ పుస్తకం అలాగే వళ్ళో వుంచుకుని, వెనక్కి వాలి కళ్ళు మూసుకుంది.

లక్ష్మి వ్రాసిన సీరియల్ అది.

తెలియనప్పుడు చదవటం వేరు. రచయిత్రి ఎవరో తెలిసిన తరువాత చదవటం వేరు. అందులోనూ తన స్నేహితురాలు వ్రాసిందని తెలిశాక మరీ ఎగ్జయిటింగ్‌గా వుంది.